# ఒక సంస్కర్త భార్య ఆత్మ కధ!
# ఒక పాటల కవి భార్య మనోవేదన!

[ఈ స్త్రీలు, నాకు ఇచ్చిన గాధలు ఇవి!]

ఆ ఇద్దరు స్త్రీల నిజం పేర్లు:

## శకుంతల - పద్మావతి

“వ్యభిచారం అనేది, శరీరాలతోనే కాదు: అది కుదరని
సందర్భాలలో, మనసులతోనే జరుగుతుంది.
ఇది నాకు తెలిసిన కొత్త జ్ఞానం!” - శకుంతల

“జీవితంలో ఒకరి మీద ప్రేమ ఏర్పడుతుంది.
అంత మంది మీద ప్రేమా?
దానికి వేరే పదం వుంది” - పద్మావతి

పిట్టల దాంపత్యాలు
సామాజికం కాదు, కేవలం ప్రకృతి !
మనుషుల దాంపత్యాలు
కేవలం ప్రకృతే కాదు, సామాజికం కూడా !
సమాజంలో వున్న చెడ్డో, మంచో !
చెడ్డని అంతం చెయ్యకపోతే,
బిడ్డలకు ద్రోహం ! దాంపత్య శాంతికి ద్రోహం !

సంకలనం:
రంగనాయకమ్మ

# ఒక సంస్కర్త భార్య ఆత్మ కధ!
# ఒక పాటల కవి భార్య మనోవేదన!

[ఈ స్త్రీలు, నాకు ఇచ్చిన గాధలు ఇవి!]

ఆ ఇద్దరు స్త్రీల నిజం పేర్లు:

**శకుంతల**

**పద్మావతి**

సంకలనం:

రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

**ఒక సంస్కర్త భార్య ఆత్మ కథ!**
**ఒక పాటల కవి భార్య మనోవేదన!**

పేజీలు : **141**
[ 1/8 సైజులో ]
ధర : **40** రూ.లు

వ్రాసిన కాలం : లోపల చూడాలి

పుస్తకంగా 2015 నవంబరు

కంపోజింగ్ & పేజ్ మేకప్ :
**ఎన్. రఘురామయ్య**
**ఎం. శారద**

ముద్రణ :
**చరితా ఇంప్రెషన్స్**
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండిస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020.
(ఫోన్: 9989980862)

ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్‌హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520 002
(ఫోన్: 0866 - 2431181)

రంగనాయకమ్మ అడ్రసు :
76, లేక్ సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# విషయ సూచిక

## ముందు మాట


1. ఒక సంస్కర్త భార్య ఆత్మకథ............ 5
[ఇది నాకు అందిన సందర్భం]

2. శకుంతల రాసిన గాథ...................... 9

3. 'శకుంతల గాథ' తర్వాత,
నా మాట ................ 122

4. ఒక పాటల కవి భార్య
మనో వేదన.............. 127
[దీని మొదటి సందర్భం]

5. పద్మావతి నాకు రాసిన ఉత్తరం .... 128

6. పద్మావతి ఉత్తరం తర్వాత,
నా మాట ................. 136

# ముందు మాట

**ఈ పుస్తకంలో, కనపడే గాథలు నేను రాసినవి కావు.**

ఒక సంస్కర్త భార్యా, ఒక పాటల కవి భార్యా, రాసినవి. అవి, ప్రచురణల కోసం రాసిన రచనలు కావు. నేను చదవాలని, వారు నాకు అందించిన యథార్థగాథలే. నేను చేసింది, ముందు మాటలూ, చివరి మాటలూ, రాయడం వరకే. ఆ ఇద్దరు స్త్రీలకూ, నాకూ, కలిగిన పరిచయాల గురించి చెప్పడం కూడా.

ఆ ఇద్దరు స్త్రీల చరిత్రలూ, భార్యలుగా అవమానాలు భరించిన గాథలే. "చింతామణి" నాటకం రాసిన రచయిత **కాళ్ళకూరి నారాయణరావు,** "భార్యగా వుండడమే భార్య తప్పు" అని, సమాజంలో వున్న ఒక నగ్న సత్యాన్ని స్త్రీల పట్ల ఆదరంతో చెపుతాడు. అది, స్త్రీలను హేళన చెయ్యడం కాదు; స్త్రీలకు, ఒక సత్యాన్ని చూపించడం! ఆ రచన, వ్యభిచార సంబంధాల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

స్త్రీ పురుషుల కుటుంబ సంబంధాల్ని ధ్వంసం చేసే అసలైన నీచ విషయం, వ్యభిచారాలే. అవి, పురుషాధిక్యత నించి పుట్టుకు వచ్చే నేరాలే. ఆ నేరాలు, భర్తలవి అయినా, భార్యలవి అయినా, అవి, కుటుంబ శాంతి సౌఖ్యాల్నీ, బిడ్డల అనురాగ పెంపకాల్నీ, ధ్వంసం చేసే నేరాలే.

ఈ స్త్రీల చరిత్రలు చూపించిన పురుషాహంకారాలు, కట్టు కథలు కావు; సాహిత్య కల్పనలు కావు. యథార్థంగా ఆ భార్యలు రాసిన సత్యాలు! ఆ భార్యలు రాల్చిన కన్నీటి చుక్కలు! కన్నీటి ధారలు! వేరు వేరు సందర్భాల్లో ఇవి నా చేతుల్లోకి వచ్చాయి. వీటిని నేను ఏళ్ళ తరబడీ భద్రపరిచి వుంచాను. ఇప్పటికి వీటిని బైట పెడుతున్నాను.

ఆ స్త్రీల భర్తల పేరులూ, వారి వూరులూ, అవసరం లేదు. జరిగిన విషయాలూ, సంఘటనలూ, కనపడితే చాలు. తెలుసుకో వలిసింది వాటినే.

**రంగనాయకమ్మ**

15-11-2015 ★

# 1. ఒక సంస్కర్త భార్య ఆత్మకథ!

## మొదట, ఇది నాకు అందిన సందర్భం చెపుతాను.

దాదాపు 30 ఏళ్ళ నాటి సంగతి ఇది!

ఒక రోజున, దాదాపు 70 ఏళ్ళ వయసు గల ఒక సన్నని ఆవిడ, నా కోసం మా ఇంటికి వచ్చారు. రాగానే ఒక సంచిలో నించి, పెద్ద కాయితంలో చుట్టిన నోట్ పుస్తకాల వంటివి తీసి నాకు అందించారు.

వెంటనే అందుకున్నాను. "ఏమిటిది? మీ పేరు చెప్పండి ముందు" అన్నాను.

"శకుంతల" అని ఇంటి పేరుతో సహా చెప్పారు. తర్వాత, నాకు ఇచ్చిన పుస్తకాల గురించి చెప్పారు. "ఇది నా పిల్లల కోసమే, వాళ్ళు చదవాలని వ్రాశాను. నాకు ఇద్దరు పిల్లలమ్మా! మొగ పిల్లవాడూ, ఆడ పిల్లా. చదువులు ముగిశాయి లెండి. ఏవో ఉద్యోగాలు కూడా చేసు కుంటున్నారు. వాళ్ళ కోసమే వ్రాశాను. ఇది నా జీవితంలో విషయాలే."

"అంటే, మీ ఆత్మ కథా?"

"అమ్మో! అటువంటి పేర్లు వద్దు. ఆ కాయితాల్లో వున్నదంతా నా జీవితమే. నా చిన్నతనం నుంచీ, ఈ నాటి వరకూ గడిచిన విషయాలు వ్రాశాను. నా పిల్లలకు చాలా విషయాలు తెలియవు. నేనే తప్పు చేశాను; వాళ్ళకేదీ చెప్పలేదు. ఇంటిలో గొడవలు పిల్లలకు చెప్పకూడదను కున్నాను."

"పిల్లలు కూడా ఇంటిలోనే వుంటారు కదా? వేరే చెప్పేదే ముంది? ఇంటిలో జరిగేది వాళ్ళకు కూడా తెలుస్తూనే వుండదా?"

"నిజమే గానీ, వాళ్ళు చూసేవే వాళ్ళకి తెలుస్తాయి గానీ, వాళ్ళు పుట్టక ముందు జరిగినవీ, వాళ్ళు చదువులకు పోయినప్పుడు చూడ నివీ, చాలా వుంటాయి కదమ్మా? నా గురించి ఎంత తెలియాలో అంత తెలియకే వాళ్ళకి నా మీద అపార్థాలే వున్నాయి. ఇది చదివి వాళ్ళు నిజం తెలుసుకోవాలని నా ఆశ. తెలుసుకుంటారో లేదో గానీ, తెలుసుకోవాలని."

"బాగుంది. మరి, ఇది నాకు ఇచ్చారేమిటి? మీ పిల్లలకి ఇవ్వాలి కదా?"

"ఇది మీ కోసం కూడా వ్రాశానమ్మా! పిల్లల చేతుల్లో పెడితే, వాళ్ళు శ్రద్ధగా చదువుతారని నాకు నమ్మకం లేదు. వెటకారంగా ఏదో అనేస్తారని నాకు భయం. అసలు మొదట మీరే చదవాలి. మీరే చూడాలి. నేను ఎలా వ్రాశానో మీరు చెప్పాలి. నాకు ధైర్యం వస్తుంది."

"నేను చదవాలని ఎందుకు అనుకున్నారు? నేను మీ కెలా తెలుసు?"

“అయ్యో! మీరు వ్రాసేవి వార పత్రికల్లో చాలా చదువుతాను. మీరు నా వ్రాతలు అర్ధం చేసుకుంటారని నాకు అనిపించింది. మీరు చదివితే నాకు సంతోషం అమ్మా!”

“సరే, నేను చదువుతాను. తప్పకుండా చదువుతాను” అంటూ ఆ కాయితాలన్నీ ఎన్ని పేజీలు వున్నాయో చూశాను. 289 పేజీలు. ఆ రాత కొన్ని చోట్ల కుదురైన అక్షరాలు గానే వుంది. కొన్ని చోట్ల గజి బిజిగా కూడా వుంది. కానీ, అక్షరాలన్నీ లైన్ల మీద ఎంతో కుదురుగా, బల్లల మీద పిల్లలు బల్లల్ని అంటుకుని కూర్చున్నట్టు, అక్షరాలు లైన్లకి అంటుకుని వున్నాయి!

నేను ఆశ్చర్యపడి, “వాక్యాలు ఎంత గీతలుగా వున్నాయో! నా రాత అయితే ఇట్లా రాదు. లైన్ల మీద మొదలు పెట్టినా, ప్రతీ వరసా పైకో కిందకో పోతుంది” అన్నాను, నవ్వుతూ.

“మీరు త్వర త్వరగా వ్రాస్తారేమో! నేను, పిల్లలు జాగ్రత్తగా చదవాలని నిదానంగా వ్రాశాను.”

“ఇది చదవడం చాలా తేలిక అవుతుంది నాకు. మూడు నాలుగు రోజులు పట్టొచ్చు.”

“అయ్యో! అంత తొందర ఎందుకు? మీ పనులు మీకు వుండవా? ఒక నెల రోజుల్లో పూర్తి చేసినా చాలు.”

“అన్ని రోజులు అక్కర లేదు లెండి. నేను చదివిన తర్వాత మీకు ఉత్తరం రాస్తాను. అప్పుడు వచ్చి మీరు దీన్ని తీసుకు వెళ్తారు కదా?”

“తీసుకు వెళ్ళి ఏం చెయ్యను? మీ దగ్గిరే వుంచండి. ఎప్పుడో అప్పుడు పిల్లలకి చెపుతాను. నేను నా గురించి వ్రాసుకున్నానని, అదంతా రంగనాయకమ్మ గారికి ఇచ్చానని, వాళ్ళకు చదవాలని వుంటే అక్కడికి వెళ్ళి తెచ్చుకోమని, చెపుతాను. వాళ్ళు వచ్చి మీ దగ్గిర తీసుకుంటారు. అందాకా మీ దగ్గిరే వుంచండి. ఉంచడానికి వీలవదా?”

“ఎందుకు వీలవదు? చాలా జాగ్రత్తగా వుంచుతాను. కానీ, మీ పిల్లలు తొందరగా చదివితే బాగుంటుంది. నేను చదివిన తర్వాత, రిజిస్టరు పోస్టులో మీకు పంపితే మీ దగ్గిరే వుంచండి. పిల్లలు ఇక్కడికి వచ్చి తీసుకోవడం ఎందుకు? మీ దగ్గిర వుంటే మంచిది కదా? మీరు చెప్పగానే చదువుతారు.”

“మంచిదే గాని, వాళ్ళకి ఆ మంచి తెలుస్తుందా? నేను దీన్ని వ్రాయడానికి మూడు నాలుగు నెలలు పట్టింది. ఏదో వ్రాస్తున్నానని వాళ్ళకి తెలుసు. ‘డైరీలు రాస్తున్నావా? కవిత్వాలు రాస్తున్నావా?’ అని వెటకారాలు చేశారు గానీ, ‘అమ్మ ఏమిటి వ్రాస్తోంది?’ అని కొంచెం ఆలోచించలేదు. వాళ్ళేం మాట్లాడినా, దాన్ని హాస్యం అంటారు. జోకులు అంటారు. మీ దగ్గరకు వచ్చి

వాళ్ళు తీసుకోకపోతే, పోనీ మీ దగ్గిరే వుండనివ్వండి. మీ చేతుల్లో వుంటేనే నాకు తృప్తిగా వుంటుంది.''

``ఆ తర్వాత నేనేం చెయ్యను దీన్ని? ఇది చదివి నేను ఒక కథ రాయాలని మీ కేమైనా అభిప్రాయం వుందా?''

``అబ్బే, ఇదేం కథ? ఆడ వాళ్ళ సంగతులు ఎన్నో వ్రాశారు మీరు. మీరు చదవాలి, అంతే.''

``సరే, నేను తప్పకుండా చదువుతాను. నిజానికి నేను ఇప్పుడు 'కాపిటల్ పరిచయం' రాసే పనిలో వున్నాను. తయారైన చాప్టర్లలో ఇంకా ఇంకా సర్దుళ్ళు అవసరమవుతున్నాయి. ఒక్కో రోజు డైలీ పేపరు చూసే పని కూడా ఆపేస్తున్నాను. ప్రతీ గంటా నాకు ఒక్క నిముషం లాగ అయి పోతోంది. టైము చాలడం లేదు. అయినా, ఇది చదవాలనే అనుకుంటు న్నాను. చదివి మీకు రాస్తాను. మీరు మళ్ళీ ఒక సారి రాగలరా?''

``మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను. ఆ లోగా నేను పోకుండా వుంటే.''

``అలా అనకండి! అంత నిరుత్సాహం ఎందుకు? ఇన్ని పేజీలు రాశారు. నిరుత్సాహం వుంటే ఇది రాయగలిగేవారా?''

``అమ్మా! వ్రాశాకే నిరుత్సాహం ఎక్కువైంది. వ్రాశాకే నా తప్పులన్నీ నాకు స్పష్టంగా కనపడుతున్నాయి.''

``నిజంగా తప్పులు జరిగితే, వాటిని తెలుసుకుంటే చాలు. ఏ తప్పూ జరగనట్టు గానే అనుకుంటూ వుంటే, అదే సిగ్గు పడాల్సిన విషయం. తప్పులు తెలుసుకున్నానంటున్నారు. సిగ్గులూ, నిరాశలూ, అక్కర లేదు.''

``ఏమో! చల్లని మాట మాట్లాడే వాళ్ళు లేరు నాకు. నా పిల్లలే నాకు ఎదురు పక్షం. మీరు అర్థం చేసుకుంటారని నాకు నమ్మకం. రాస్తూ వున్నప్పుడు అట్లా అనిపించేది.''

``మీ ఆయన ఎవరు? మీ పిల్లల పేర్లేమిటి?''

ఆవిడ చెప్పారు ఆ పేర్లు. ``అమ్మా! అందులో చదవండి, మీకు అంతా తెలుస్తుంది.''

ఆమె భర్త పేరు కొంచెం తెలిసిన పేరు లాగే అనిపించింది. ``అవును, చెప్పవద్దు లెండి. చదువుతాను.''

``నా పిల్లలు వచ్చి దీన్ని తీసుకోకపోతే, కొన్నాళ్ళు వుంచిన తర్వాత చింపెయ్యండి.''

``అయ్యో, అలా అనకండి. చదివి వుంచుతాను. ఎన్నాళ్ళయినా వుంచుతాను.''

ఆవిడ ఒక్క అరగంటే కూర్చున్నారేమో. ‘‘వెళ్తానమ్మా! మీరు చాలా పనులు వుండే మనిషి. నా వంటి వాళ్ళకు ఇంటి పనులు మాత్రమే వుంటాయి. మీకు అట్లు కాదు గదా?’’ అంటూ లేచారు.

‘‘ ‘చాలా పనులు’ అంటే, నాకు అన్ని పనులు వుండవు. నా పాత కాలం అది. ఇప్పుడు నాకు రోజంతా నా పుస్తకాల పనే. అదే అసలు పని నాకు.’’

‘‘బాగుంది. మీకు ఇంటి పనులెందుకు? మీకు దగ్గరగా వుంటే నేను మీకు కొన్ని పనులు చేసి పెట్టేదాన్ని. కానీ, చాలా దూరం. వెళ్తానమ్మా!’’

‘‘కొంచెం మంచినీళ్ళు ఇమ్మంటారా?’’

‘‘దాహంగా లేదు. అయినా మీ చేతితో ఇస్తే తాగుతాను.’’

పెద్ద గ్లాసుతో మంచి నీళ్ళు ఇచ్చాను.

ఎత్తి పోసుకుని తాగారు.

నేను నవ్వాను. ‘‘ఈ పద్ధతి మంచిది. నాకు ఇది ముప్పై ఏళ్ళ వయసు తర్వాతే అలవాటయింది.’’

‘‘నాకు చిన్నప్పటి నించీ ఇట్లు అలవాటేనమ్మా! ఇది కూడా రాశాను అందులో.’’

‘‘అలాగా? అయితే ఇప్పుడే మొదలు పెడతాను మీ పుస్తకం.’’

ఆవిడ నెమ్మదిగా వెళ్తోంటే నేను కూడా గేటు దాకా వెళ్ళాను. ‘‘నేను తప్పకుండా మీకు నాలుగైదు రోజుల్లో ఉత్తరం రాస్తాను’’ అని చెప్పాను.

ఆవిడ దూరంగా వెళ్ళిపోయేవరకూ చూచి, గేటు మూసి లోపలకువచ్చి, నిజంగా ఆ నోట్ బుక్కులు అప్పుడే తెరిచి చదవడం మొదలు పెట్టాను.

‘ఆవు’ని సాధు జంతువు అంటాం. మనుషుల్లో కూడా అటువంటి ‘సాధువైన’ మనుషులు వుంటారు. శకుంతల అటువంటిది గానే కనపడ్డారు. సన్నని మనిషి. తెలుపు రంగే. కానీ కళ తగ్గిన రంగు. పెద్ద వయసు. బల హీనురాలు. నెరిసిన తల. వాడిన దేహం. వెలిసిన పాత చీర.

కానీ, దీనురాలు కాదు. ఏదో దృఢత్వం వున్న మనిషి. - ఆమె రాసిన నోట్ బుక్సు ఇంకా తెరవక ముందు, ఆమెని చూసి మాట్లాడినప్పుడు, ఆమె గురించి నా భావాలు అవి. అందుకే నాకు ఆ పుస్తకాలు త్వరగా చదవాలని పించింది.

ఆ రోజు నిజంగా నా ఇతర పనులు ఆపుకున్నాను. ఆమె ఇచ్చిన కాయితాలలో ఎటువంటి విషయాలు వున్నాయో చూడాలని నాకు ఆసక్తీ, ఆతృతా, ప్రారంభమయ్యాయి. మొదటి నోట్ బుక్కు తెరిచాను.

***

# 2. శకుంతల రాసిన గాథ!

**నా**కు జ్ఞాపకం వున్నంత వరకూ నా జీవితంలో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటీ జ్ఞాపకం చేసుకొనుటకు ప్రయత్నించాను.

ఇలా వ్రాసుకొన్నందువల్ల ఏదో గొప్ప వస్తుందని కాని, ఇది చదివినందు వల్ల ఏ ఒక్కరికి మేలు కలుగుతుందని గాని, దీన్ని వ్రాయుట లేదు. నాకు ఆత్మీయులు అయిన ముగ్గురు, నలుగురు వ్యక్తులకు, నా జీవిత విశేషాలు తెలిపి, నాకు నేనే కొంత శాంతి కలుగ జేసుకోవలెననే కోరికతో వ్రాస్తున్నాను ఇది. పాము అయినా తన బాధ పుట్టలో వూదుకొంటుందనే సామెత ఉన్నది గదా?

ముఖ్యంగా, నా బిడ్డ లిద్దరు ఒక్క సారి సావకాశంగా చదివి నా జీవితంలో నేను పొంద లేనిది, పోగొట్టుకొన్నది, తెలుసుకోవలెననే గట్టి కోరిక నన్ను ఈ వ్రాతకు ప్రోత్సహించింది. వారికి ఏ విధమైన లోటు, నాకు చేత నయినంత వరకు జరుగనీయకూడదని; నా బాధలు వారికి చిన్న వయస్సులో ఏ మాత్రం తెలియనీయ కూడదని; అట్టి మూఢ విశ్వాసముతో పెంచినందుకు అదే నాకు శాపంగా పరిణమించింది. అందుకు చింతిస్తూ ఇది వారు చదివిన ఎడల తల్లి అవమానములు తెలుసుకొందురనే కొండంత ఆశతో వ్రాస్తున్నాను.

గత జలసేతు బంధనానికి ప్రణాళిక వేస్తున్నానని, చేతులు కాలిన తరువాత ఆకుల కోసం వెతుకుతున్నానని కూడా తెలుసు. నా కోరిక తీరినా తీరక పోయినా, నా కోరిక తీర్చువారు చదువనైనా చదువరా అనే బలమైన కోరికను అణచుకోలేక నేను చేసే ప్రయత్నమిది. ఆశ, మానవునకు దివిటీ వంటిది గదా?

**శకుంతల** అను దానను నేను, ఒక సంవత్సరం పిల్లనయి ఉన్నప్పుడు, మా తండ్రి స్వర్గస్తులైనారని మా మేనత్త చెప్పగా, పెద్ద దానినై వినే దానిని. నా తండ్రి మంచితనాన్ని గురించి నాల్గు మాటలు వ్రాసుకోవలెనని నా కోరిక. నా తండ్రిని నేను ఎరుగక పోయిననూ వారిని గురించి వ్రాయుట సమంజసమే ననిపిస్తోంది నాకు.

ఒక సారి మా తండ్రి గారు, మరి ముగ్గురుతో కలసి చీట్లపేక ఆడుచుండిరట. అందులో ఒక వ్యక్తి తనే గెలువ వలెననే కోరికతో సత్యమును మరుగు పరిచి, అసత్యంగా వాదించిరట. కొద్ది సేపు వాదన జరిగిన తరువాత, ఇట్లే వాదన పెరిగిన ఎడల పోట్లాట జరుగునని మా తండ్రి తలచి, పేకాటలో ఎప్పుడు అయినా ఇటు వంటి పరిస్థితులే వచ్చునని గ్రహించి, "ఈ రోజు మొదలు పేకాట నేను ఆడను" అని చెప్పెనట. ఆ రోజు మొదలు ఆయన మరెప్పుడూ ఆ పేకాట వ్యసనమునకు పోనే లేదట.

ఇంకొక సంగతి విన్నాను. అప్పటి కాలంలో, అయిదేసి రోజులు వివాహ

ములు జరిపే వారు. బాగా పలుకుబడి కలిగిన వారు, బంధుప్రీతి గల వారు అయినచో, దగ్గర దగ్గర వంద బండ్ల దాకా కట్టుకొని కన్యాదాత ఇంటికి తరలి వెళ్ళేవారు. అలా వెళ్ళుతున్న ఒక సందర్భంలో, ఒక బండి బోల్తాపడి ఒకరికి తల మీద బాగా గాయమైనదట. అప్పుడా వ్యక్తికి కట్టు కట్టుటకు "మీ వద్ద పాత గుడ్డ ఏమైనా వున్నదా, వున్నదా" అని ఒకరి నొకరు ప్రశ్నించుకొనుచుండగా, ఆ కాలయాపనకు సహించలేక మా తండ్రి, తను కట్టుకొన్న సరిక్రొత్త గ్లాస్కో పంచెనుండి ఒక గజం ముక్క చించి వారికి కట్టు కట్టిరట! వారిని గురించి ఇంకొక్క మాట వ్రాసి చాలిస్తాను.

వంద ఎకరాల తన సుక్షేత్ర భూమిని, మాట పట్టుదల కొరకు విడిచి పెట్టిరట. ఈ వివరములు నాకు అర్థం కాలేదు. ఇలాంటి విషయాలు మా మేనత్త చెపుతూ ఉండేది.

ఇప్పుడు వేదికకెక్కి పెద్ద పెద్ద ఉపన్యాసములు గంటల కొలది చెపుతూ వాటితోనే తల పండిపోయి, తన కుటుంబ విషయానికి వచ్చేసరికి మేక తోలు కప్పిన పులిలా, స్వార్థమే పరమార్థం గావించుకొంటారు కొందరు. పక్షపాత దృష్టితో చూసే వారికి, సత్య దృష్టితో చూసే వారికి, దోమకు ఏనుగుకు వున్నంత తేడా ఉంటుంది. ఒక్క సారి వేదిక నెక్కి, ఒక్క ఉపన్యాసము ఇచ్చి, ఒక్క పూలమాల మెడలో వేయించుకొంటే, నా అంత తెలిసిన వాడు, నా అంత జ్ఞాని మరొకరు లేడనే, అహం భావం, వారిని పైకి లేవనీయకుండా ముంచెత్తుతూ ఉంటుంది.

[ఈ శకుంతల, ఇటువంటి వివరణలు, తన భర్త గురించే చేస్తోంది. కానీ, ఆ భర్త ప్రవేశం, ఈ చరిత్రలో ఎంతో దూరంగా వెళ్తే తప్ప కనపడదు.]

ఆ ఉపన్యాసాలు విన్న తెలివి తక్కువ వారు కొందరు, త్యాగాన్ని గురించి, ధర్మాన్ని గురించి, పరోపకారాన్ని గురించి, సత్యాన్ని గురించి, ఉప న్యాసకుడు ఎంత అనర్ఘళంగా చెప్పెనోయని, అవియన్నీ ఆయన ఆచరిస్తూ వుండకపోతే ఇంతగా చెప్పగలుగునా అని, పొగడ్తలు మొదలు పెడతారు. ఉపన్యాసకుడి అహం నానాటికి పెరిగి పెద్ద వృక్షమయి వూడలు కూడా దింపుతుంది. ఆ అమాయకుల పొగడ్తలు అగ్నిలో ఆజ్యం పోసినట్లే, వీరిని ఆనందింప చేస్తాయి. దానితో వీరి స్వార్థం పెరగి పోతుంది. వారి స్వార్థానికి వ్యతిరేకంగా ఏ చిన్న పని గాని, మాట గాని, వారు సహించలేరు. వీరిని పొగిడే వారే, వీరికి ఆప్తులు.

సత్యాన్ని హతమార్చి, ధర్మమును అణగద్రొక్కి, త్యాగాన్ని మాటలలోనే వదలివేసి, పరోపకారాన్ని చేస్తున్నట్లు నాటకమాడే పెద్ద మనుష్యులకు, ఉత్తముల ననుసరించుట ఎట్లు సాధ్యమగునూ? తన సొంత డబ్బా తను మ్రోగించుకొంటూ వుంటే, అందరూ తనను గౌరవించక ఏమి చేయగలరని వీరి ఊహ. నేను ఏమి చేస్తే మాత్రం నన్ను ఎవరేమి అనగలరు - అనే కీర్తి కాంక్ష వీరిలో రోజు రోజుకూ పెరిగి

పోతూనే ఉంటుంది. అదే కీర్తి కాంక్షతో దానికి మరిన్ని సమిధలు చేరి, ఎందరి కోరికలు నేలమట్టం అవుతున్నవో వూహించేందుకు వారికి టయిమేది?

గంజిలోకి ఉప్పు లేనంత మాత్రాన బాధ పడకూడదని జ్ఞాన బోధ చేసే మహాత్ములు, వారికి ఒక్క పూట పాలల్లోకి ఒక్క చెంచా పంచదార తక్కువ అయితే సహించలేరు. వెనుకటికో డాక్టరు, ఎన్నో కంతులు కోసితిని గాని, నా కంతి అంత నొప్పి ఒక్కటీ పెట్టలేదు అనెనట!

దాన కర్ణుడనే ఘనత ఒక్క కర్ణుడికే దక్కింది; దేవుళ్ళే భూలోకంలో అవతరించి, దుష్ట శిక్షణా, శిష్ట రక్షణా, చేసినప్పటికీ. సత్యమునకు హరిశ్చంద్రునితో పోలిన వారొక్కరూ లేరు.

మా చిన్నతనమంతా ఉమ్మడి కుటుంబమే. ఆ ఇంటి నుంచి నేను బైట పడిన తరువాత కూడా అది ఉమ్మడి కుటుంబమే. మాకు తండ్రీ, పిన తండ్రీ, మేనత్తా వుండినా, వారిలో తండ్రి తెలియడు. మేనత్తకి వేరే ఊరులో కాపురం. నాకు అన్నా, ఇద్దరు అక్కలూ, చివరికి నేనూ. నాకు తెలిసినది తండ్రి లేని కుటుంబమే. నా తండ్రి వున్నట్టయితే, నా బ్రతుకు సుఖశాంతులతో గడిచేదని భావించుతాను నేను ఇప్పటికీ.

ఇక, మా తల్లిని గురించి కూడా నాలుగు మాటలు వ్రాసి, నా బ్రతుకు కథకు వస్తాను. నాకు తండ్రి తెలియడు గాని, తల్లి బాగుగా తెలుసును. మా తల్లి ఎదటి వారి కష్టమును తనదిగా భావించే సుతిమెత్తని మనసు గలది. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మే అమాయకురాలు. నా తల్లి గురించి, 'నా తల్లి' అనే ప్రేమ వాత్సల్యములతో చెప్పుట కాదు ఇది. ఆమె జీవితం గురించి విన్నచో నేను అసత్యములు చెప్పలేదని తెలుసుకోగలరు.

తన పుట్టింటి నుంచి, 16 ఎకరాల భూమి తెచ్చుకొని, ఆ భూమి మీద వచ్చు అయివేజును వాడుకొనుట చేత గాని, నిర్భాగ్య జీవితమే ఆమెది. నా భూమి మీద డబ్బు వస్తున్నప్పుడు, నాకిష్టమైనట్లు నేనెందుకు వాడుకోరాదనే ఆలోచన లేని అసమర్థ రాలామె. ఆ అసమర్థత, డబ్బు వషయంలోనే. ఇంటిలో ఏది వున్నా, ఎవరికేది అవుసరమైతే అది తన శక్తి మేరకు, అవతలి వారికి సహాయపడే గుణం ఆమెది.

మా తల్లికి ఏ మాత్రం చదువను వ్రాయను రాదు. చివరకు ఏ పురాణ శ్రవణం గాని, హరికథలు గాని, నాటకాలు గాని, వినుట గాని, చూచుట గాని, ఎరుగదు. కూపస్త మండూక జీవితం జీవిస్తూనే హరిజనులంటే కూడా ఎంత ఆదరించేదో. ఒక ప్రక్క సంఘానికి భయపడుతూ కూడా వారిని ఎంత ఆదరణతోనో చూచేది. ఆవుగాని, గేదెగాని, ఈనినచో జున్ను ముత్తయిదువులకు పెట్టిన వెంటనే పని పాటలు చేసే వారికి వారి భాగం ఒక చోట భద్రపరిచేది. వారికి కబురు చేసి పెట్టే వరకు, ఆమెకు నిద్ర పట్టేది కాదు. అటువంటి అలవాట్లు పని వాళ్ళకు ఎందుకు చేస్తావని ఇరుగు పొరుగులు ఈమెను మందలిస్తూ ఉండే వారు. "గొడ్ల సంరక్షణ వారిచే చేయించుకొని వారికి పెట్టకుండా తినుటకు నాకు

నోటికి పోదమ్మా" అనేది. అట్లే మజ్జిగలు పోసేది. పసి పిల్లలకు పాలు అవుసర పడితే అవి పోసేది. ఆమెకు భర్త, నా తండ్రి, బ్రతికి ఉన్నంత కాలం ఆమె పొలం మీద

ఆదాయమంతా తీసుకొని వచ్చి ఉమ్మడి కుటుంబంలోనే పెట్టేవాడు. ఆయన అనంతరం, మా పినతండ్రి భూమి పంపకాలు పంచుతూ మా తల్లితో, "వదినా! అన్నయ్య నీ డబ్బంతా ఇంటికి ఖర్చు చేశాడు. అది మా అందరకూ తెలిసిన విషయమే. ఇప్పుడు ఆ డబ్బును గురించి ఏమి చేయమని నీ ఉద్దేశము?" అని అడిగెనట.

దానికి మా తల్లి వెంటనే, "తిన్న వాళ్ళందరమూ మనమే. ఇందులో పరాయి వారెవరూ లేరు. ఆ డబ్బును గురించి ఏమీ ఆలోచించ నక్కరలేదు" అని ఈమె సమాధానమిచ్చినదట.

మరిది గారికి సర్వాధికారాలూ ఇచ్చి, ఆయన ఏమి చేసినా వూరుకొని, ఎట్టి పరిస్థితులలోనూ ఆయన మాటకు ఎదురు చెప్పక, జీవితం గడి పినదామె.

మా పిన తండ్రిని 'ధృత రాష్ట్రుడు' అను పేరుతో సంబోధిస్తానిక నుండి అప్పుడప్పుడు. ఆ పేరు ఆయనకు ఎంత గానో రాణిస్తుంది.

[ఈ చరిత్రలో, 'ఆస్తి' సంగతులు అడుగడుగునా కనపడతాయి. 'ఆస్తి' అనేది, మానవ సంబంధాల్ని ఎలా తిప్పు తుందో తెలిపే సంఘటనలు అవి అన్నీ.]

మా చిన్న తాతగారి కూతురు కూడా మాకు మేనత్త అవుతుంది. ఆమె భర్తకి ఆస్తి వున్నప్పటికీ ఆయన పరమ లోభి. ఆయన అక్క గారు కూడా మొగుడు పోయి, పిల్లలు లేక, తమ్ముడి ఇంటికీ చేరింది. అప్పటి నుంచి తమ్ముడి భార్యకి రంపపు కోతలు మొదలు పెట్టింది. మా మేనత్త పడే బాధలన్నీ భర్త చూసేవాడు గానీ, పట్టించుకునేవాడు కాడు. అక్క గారి ఆస్తి తనకే చెందుతుందని అక్క గారికి బంటుగా వుంటూ, భార్యనే మంద లిస్తూ వుండేవాడు. ఆఖరికి, ఒక నాడు మా మేనత్తకి, ఆమె ఇంట చేరిన ఆడబిడ్డ, అన్నంలో విషం పెట్టి, మంచి కూరతో అన్నం వడ్డించింది. ఆ పూట కడుపు నిండా తిన్న అమాయకురాలు నిద్రపోయి మరి లేవలేదు! గంటల మీద అంత్యక్రియలు జరిగిపోయాయి. ఇటు వంటి ఘోరం నాకు కూడా ఎప్పుడో జరు గుతుందనే జంకు నాకు కొన్ని దినాల్లో పట్టుకుని పీడించింది. చచ్చిపోయిన మేనత్త భర్తకి అక్కగారి ఆస్తి దక్కనే లేదు. ఆమె, ఇంకెవరికో రాసింది దాన్ని.

మా పెద్ద అక్కకి స్వంత మేనత్త కొడుకుతోనే పెండ్లి జరిగింది. అతణ్ణి రాజకీయాల వాడని, జ్ఞాని అని, గాంధీ మార్గంవాడని, అందరూ గొప్పగా చెప్పు కుంటారు.

మా చిన్న అక్కకి, మా పిన తండ్రి బావ మరిదితో పెండ్లి జరిగింది. మరి కొంత కాలానికి, మా అన్న కొరకు 'మా పిల్లను చేసుకోండి' అంటే, 'మా పిల్లను చేసుకోండ'ని, సంబంధాల మీద, సంబంధాలు రాసాగినాయి. పిల్లనిస్తా మని తిరిగే వారందరూ, మా బంధు వులు, తెలిసిన వారు, తెలియని వారూనూ. మా పిన తండ్రికి నలుగురు

కొడుకులు. వాళ్ళలో, మా అన్న కంటేనూ పెద్ద వయసు కొడుకు వున్ననూ అతనికి రాని సంబంధాలు మా అన్న కొరకు వచ్చేవి. మా అన్న అయితే, ఒక్క కొడుకే. మా తండ్రి ఆస్తిలో వదిలి వేసినది పోగా, కొంత మిగిలి వున్నది. మా తల్లి ఆస్తి అంతా ఆ కొడుకుకే అని అందరికీ తెలుసు.

అందులకే, మా అన్న కొరకు వచ్చే సంబంధాలను చూసి, మా పిన తండ్రీ, పిన తల్లీ కూడా అసూయ పడుతూ, ఆ సంబంధాలన్నిటి గురించి ఏవేవో చెప్పి వాటిని వెళ్ళ గొడుతూ వుండేవారు. మా తల్లికి ఏమీ తెలియదు. మరిదిని నమ్మి అంతా వారిద్దరి చేతులకు అప్ప గించింది.

మా పిన తండ్రికి ఎంత అసూయలు కలిగిననూ చివరకు ఒక సంబంధం ఖాయం చేయక తప్పలేదు. మా అన్నకు రెండు వేలు కట్నమూ, మా ముగ్గురు ఆడ బిడ్డలకూ ఒక్కొక్క వంద ఇవ్వడమూ అని ఒప్పందం జరిగినది.

అయితే, నా పెండ్లి వ్యవహారం కూడా జరగవలసి యున్నది. నా కొరకు కట్నం ఇచ్చుట మా పిన తండ్రికి ఇష్టం లేదు. కట్నం లేని సంబంధం కుదిర్చి మా అన్నకు డబ్బు ఖర్చు కాకుండగా చేయుటకు ఆలోచించి, అన్నంలో విషం తిని మరణించిన దూరపు మేనత్త కొడుకు సంబంధాన్ని కుదిర్చినాడు.

ఆ కుర్రవానికి పిల్లని ఇచ్చుటకు ఎవ్వరునూ అంగీకరించుట లేదట. ఆ కుర్రవాని మేనత్త ఇంకా ఆ ఇంటిలోనే వున్నది. ఆ ఇంటికి తమ పిల్లను పంపిన, దానిని కూడా విషం పెట్టి చంపునని ఇతరులందరూ భయపడుచుండగా మా పిన తండ్రికి ఆ సంబంధం కట్నం లేకుండగా దొరికినది. మా అన్న, తన పిన తండ్రి తనకు చేసిన ఉపకారము నకు సంతోషించినాడు.

***

పెండ్లి నాటికి నాకు పది యేండ్లు. పెండ్లి కుమారుడు పధ్నాలుగు యేండ్ల వాడని అందరూ చెప్పుకున్నారు. నేను ఆడ పిల్లను గనక నా పెండ్లి మా వూరు లోనే మా ఇంటి ముందు జరగవలసి యున్ననూ, ఆ ఖర్చు కూడా మా అన్నకు లేకుండా, పిల్ల వాని ఇంటనే పెండ్లి జరగాలని మా పిన తండ్రి మగ పెండ్లి వారికి షరతు పెట్టినాడు. వాళ్ళు, అన్ని షరతులకూ అంగీకరించినారట! దానికి మా అన్న సంతోషించినాడు.

ఎదుటి వారి బాధ తమకు పట్ట నట్టు తమ స్వార్థమే పరమార్థం గావించు కొనే వారిని ఏమని సంబోధించాలి? నా అనుభవం నేర్పిన పాఠం చేత, అట్టి వారిని ద్విపాద పశువులు అనవచ్చు ననుకుంటాను.

సత్యసంధులు, ధర్మ మూర్తులు, త్యాగధనులు, దానకర్ణులు, దయామయులు, ఈ ప్రపంచంలో లేరనే టంతటి పాతకానికి, నేను ఒడిగట్టుట కాదు. వారు ఉందురు. కాని వారు, నివురు గప్పిన నిప్పు పగిది, ప్రపంచ దృష్టికి రాక, సాధ్యమైనంత వరకూ వారి పనులేవో వారు చేసుకొంటూ, చేతనైనంత మేరకు పరులకు సహాయ పడుతూ వుంటారు.

వారి డబ్బా వారు మ్రోగించుకోరు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Oka+Samskarta+Bharya+Atma+Katha+Oka+Patala+Kavi+Bharya+Manovedana**

* * *